నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, గురువారం 13 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET



మహబూబ్‌నగర్ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో పనులు చేస్తున్న విద్యార్థులు



వనపర్తి జిల్లా కేంద్రంలోని మెట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలో మరమ్మతు పనులు చేపడుతున్న కార్మికుడు




శిథిలావస్థకు చేరడంతో పెచ్చులూడుతున్న వడ్వాట్‌లోని అదనపు తరగతి గది



మహబూబ్‌నగర్ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాలలో తోరణాలు కడుతున్న విద్యార్థులు

# తెరచుకోని వంటగది

నాగర్‌కర్నూల్, జూన్ 12 : పాఠశాలల పున:ప్రారంభం పండుగ వాతావరణంలో ఉండాలనే ప్రభుత్వ ఆదేశాలను నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ టీచర్లు బేఖాతరు చేసి విద్యార్థులు పస్తులుండేలా చేశారు. మొదటిరోజు మధ్యాహ్న భోజనం వండిపెట్టే గది తెరుచుకోలేదు. దాదాపు 800కు పైగా విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో మొదటిరోజే మధ్యాహ్న భోజనం వండలేదు. నాగర్‌కర్నూల్ పట్టణంతోపాటు మున్సిపల్ పరిధిలోని గ్రామాలు, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ పాఠశాలలో ఎక్కువ సంఖ్యలో విద్యను అభ్యసిస్తున్నారు. కాగా వంట చేసేందుకు వచ్చిన వంటమనిషి ఫాతిమాతోపాటు వంట చేసేవారు గది తాళంచెవి లేకపోవడంతో బయటే ఉండిపోయారు. మొదటిరోజు అయినప్పటికీ దాదాపు 100 మందికిపైగా విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారు. వారందరికీ మధ్యాహ్నం భోజనం పెట్టాల్సిన వంట ఏజెన్సీవారు భోజనశాల తెరవకపోవడం విశేషం. ఈవిషయమై డీఈవో గోవిందరాజులును వివరణ కోరగా మొదటి రోజు కావడంతో తక్కువ మంది వస్తారనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనాన్ని మరో పాఠశాలలో ఏర్పాట్లు చేశామని, రేపటి నుంచి అదే పాఠశాలలో వంట ఏజెన్సీ వారు భోజనం చేసి పెడతారని వివరణ ఇచ్చారు.



## ఆరంభంలోనే అలసత్వం

జడ్చర్ల టౌన్, జూన్ 12 : పాఠశాలల పునః ప్రారంభంలోనే విద్యాశాఖాధికారుల ఆలసత్వం స్పష్టంగా కనిపించింది. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం చేరాలని ప్రభుత్వం ఆదేశించినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో దాదాపు మూడువేలకు పైగా యూనిఫాంలు అవసరం ఉండగా, కేవలం పదిహేను వందల దుస్తులు మాత్రమే ఇవ్వడం గమనార్హం. మండలంలో 89 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, పలు పాఠశాలలు అరకొర వసతులతోనే ప్రారంభమయ్యాయి. అటెండర్లు, స్వీపర్లు లేక విద్యార్థులతోనే పాఠశాలలను శుభ్రం చేయించారు. ఎర్రసత్యం, గాంధీ చౌరస్తా ప్రైమరీ స్కూళ్లల్లో టీచర్లు, విద్యార్థులు కలిసి తరగతి గదులను శుభ్రం చేశారు. కోడ్గల్ జెడ్పీ హైస్కూల్‌లో అల్పాహారానికి బ్రేక్ పడింది.





ఎర్రసత్యం స్కూల్ స్టాక్‌పాయింట్ వద్ద పాఠ్యపుస్తకాలను ఆటోలోకి ఎక్కిస్తున్న విద్యార్థులు, గాంధీ చౌరస్తా పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న తరగతిగది

# తడబడి!

- మోగిన బడిగంట.. తీరని సమస్యల చింత
- పలు పాఠశాలల్లో కొరవడిన సౌకర్యాలు
- బ్రేక్‌ఫాస్ట్‌కు బ్రేక్.. విద్యార్థుల పస్తులు
- కొన్ని స్కూళ్లల్లోనే మిడ్‌డే మీల్స్
- కానరాని బడిబాట.. ఉపాధ్యాయుల ఇంటిబాట

*కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. బడి గంట మోగినా పలు పాఠశాలలు సమస్యల సుడిగుండంలో చిక్కుకున్నాయి. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కరువయ్యాయి. శిథిలావస్థలో పలు భవనాలు దర్శనమిస్తున్నాయి. ఉపయోగించలేని దుస్థితిలో టాయిలెట్లు, తాగేందుకు కరువైన నీళ్లు.. ఆవరణల్లో ఆటలు ఆడేందుకు వీలు లేకుండా వర్షపు నీళ్లు.. విరిగిన బెంచీలు.. ప్రమాదకరంగా పైకప్పులు.. గోడల్లో పెరుగుతున్న చెట్లు.. ఇలా ఒక్కటేమిటీ పలు సవాళ్లు విద్యాశాఖ ముందు ఉన్నాయి. తొలి రోజు పలు చోట్ల బ్రేక్‌ఫాస్ట్‌కు బ్రేక్ పడగా.. మధ్యాహ్న భోజనం లేక పలువురు విద్యార్థులు పస్తులు ఉన్నారు. ఇక బడిబాట కానరాక.. ఉపాధ్యాయుల ఇంటి బాట మాత్రం కనిపించింది. కొన్ని చోట్ల విద్యార్థులతో పనులు చేయించారు. మొత్తానికి మొదటి రోజు తడ'బడి'ంది.*

*- మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి), జూన్ 12*



## పెండింగ్‌లో పనులు..

మానవపాడు, జూన్ 12 : మండలంలోని 26 పాఠశాలలకు 4 పాఠశాలలు మినహా ఏ ఒక్క బడిలో కూడా విద్యార్థులు హాజరు కాలేదు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కనీసం ఒక్క విద్యార్థి హాజరు కాలేదంటే ఉపాధ్యాయుల పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఈ నెల 6 నుంచి బడిబాట ప్రారంభించిన ఉపాధ్యాయులు మొదటి రోజు తిరిగి ఆ తర్వాత కనిపించకుండా పోయారు. మొదటి రోజు ఒక్క జల్లాపురం ఉన్నత పాఠశాల మినహా ఏ ఒక్క పాఠశాలలోనూ అల్పాహారం, మధ్యాహ్న భోజనం విద్యార్థులకు వడ్డించలేదు. అలాగే చాలా పాఠశాలల్లో మరమ్మతు పనులు పెండింగ్‌లో ఉండడంతో తొలిరోజే ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.





చెన్నిపాడు పాఠశాలలో అసంపూర్తిగా టాయిలెట్ల పనులు, వర్షపునీరు నిలవడంతో బురదమయంగా మారిన మానవపాడు పాఠశాల ఆవరణ





టంకర పాఠశాలలో పిల్లర్ల వరకే పరిమితమైన వంటగది పనులు, పెద్దదర్‌పల్లి పాఠశాలలో పనులు జరుగుతుండగా బయటపడేసిన బెంచీలు, కుర్చీలు

## నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాలలు

హన్వాడ, జూన్ 12 : ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే సర్కారు బడులు సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల పథకానికి మండలంలో 38 పాఠశాలలు ఎంపిక కాగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించినా ఫలితం లేకపోయింది. దీంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. మండలవ్యాప్తంగా 4,500మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చదువుతున్నారు. అయితే ఒక్కో విద్యార్థికి రెండుజతల యూనిఫాం పంపిణీ చేయాల్సి ఉండగా.. ప్రస్తుతం ఒక్క జతనే ఇస్తున్నారు. మరో జత అందించేందుకు బట్ట రాలేదని అధికారులు చెబుతున్నారు.





గద్వాల ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న బాత్‌రూం పనులు, ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్ దుస్థితి

## ఎక్కడికక్కడే పెండింగ్..

నవాబ్‌పేట, జూన్ 12 : మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలలు బుధవారం సమస్యలతో స్వాగతం పలికాయి. పల్లెగడ్డ పాఠశాలలో అమ్మ ఆదర్శ పనులు నేటికీ పూర్తి కాలేదు. కామారం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు హాజరు కాగా వారితోనే ఉపాధ్యాయులు శుభ్రం చేయిస్తున్న దృశ్యాలు కనిపించాయి. నవాబ్‌పేటలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ అనంతయ్య ఏకరూప దుస్తులు, నోట్‌బుక్కులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. చాలా గ్రామాల పాఠశాలలకు ఏకరూప దుస్తులు పూర్తిస్థాయిలో అందలేదు. అలాగే అమ్మ ఆదర్శ పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పల్లెగడ్డ పాఠశాలలో ప్రమాదభరితంగా ఉన్న నీటి సంప్

## సమస్యలు ఫుల్..

గద్వాలటౌన్, జూన్ 12 : వేసవి సెలవులు ముగియడంతో బుధవారం జిల్లాలోని పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యాయి. పండుగ వాతావరణం కనిపించేలా కొన్ని పాఠశాలలను అధికారులు ప్రత్యేకంగా అలంకరించారు. విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ముఖ ద్వారాలకు మామిడాకులు, కొబ్బరి మట్టలతో అందంగా తీర్చిదిద్దారు. మొదటి రోజు కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కాలేదు. విద్యార్థులు పాఠశాలకు రాకముందే వసతులు కల్పించాల్సిన అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పాఠశాలల్లో విద్యార్థులకు తగ్గట్లు కనీస సౌకర్యాలను కల్పించలేకపోయారు. ప్రభుత్వ అభ్యాసన ఉన్నత పాఠశాలలో బాత్‌రూంల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నది. దీంతో విద్యార్థులు బహిరంగ ప్రదేశాలకు వెల్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తగ్గట్టుగా బాత్‌రూం వ్యవస్థ లేదు. అలాగే అనేక పాఠశాలల్లో బాత్‌రూం వ్యవస్థ సరిగ్గా లేకపోవడాన్ని అధికారులు గుర్తించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

***మొదటి రోజే పనులు..***

మొదటి రోజు పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పుస్తకాలు అందిచాల్సిన ఉపాధ్యాయులు చీపుర్లు అందించారు. పాఠాలను తిరగేయాల్సిన చేతులకు చెత్తను శుభ్రం చేసే పని అప్పగించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని ఉపన్యాసాలిచ్చే ఉపాధ్యాయులు బాలకార్మిక నిర్మూలన దినోత్సవాన విద్యార్థులతో పనులు చేయించడం ఎంతవరకు సబబో వారికే తెలియాలి.



బాలుర ఉన్నత పాఠశాలలో గదిని శుభ్రం చేస్తున్న విద్యార్థులు



వనపర్తి బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పూలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



జడ్చర్లలో విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



ముస్తాబైన వనపర్తి హరిజన్‌వాడ పాఠశాల

## అందని అల్పాహారం

నారాయణపేట, జూన్ 12 : పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు అందించాల్సిన బ్రేక్ ఫాస్ట్‌కు నారాయణ పేట జిల్లాలో బ్రేక్ పడింది. అధికారుల అలసత్వం ఏమో గానీ.. విద్యార్థులకు అందించాల్సిన అల్పాహారాన్ని అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఎప్పటిమాదిరిగానే పాఠశాలకు వెళ్తే టిఫిన్ అందుతుందని భావించిన విద్యార్థులు చాలామంది వారి ఇంటి వద్ద చేయకుండానే పాఠశాలకు వచ్చారు. తీరా అక్కడ లేకపోవడంతో పస్తులతోనే మధ్యాహ్నం వరకు గడిపారు. మధ్యాహ్న భోజనం చేసి తిరిగి తరగతి గదులకు వెళ్లారు. మొదటి రోజు కావడంతో చాలా మంది విద్యార్థులు పాఠశాలకు హాజరు కాలేదు. జిల్లాలో ఆరు హైస్కూళ్లు, యూపీఎస్, 15 ప్రాథమిక పాఠశాలలు, 319 జెడ్పీ పరిధిలో ప్రాథమిక పాఠశాలలు, 85 ప్రాథమికోన్నత పాఠశాలలు, 69 జెడ్పీ హైస్కూళ్లు, 11 కేజీవీబీలు, 2 మోడల్ హైస్కూళ్లు, 13 గురుకులాలు, నాలుగు ఎయిడెడ్ పాఠశాలలలో కలిపి 58,896 మంది విద్యార్థులు ఉండగా.. మొదటి రోజు కేవలం 12,595 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.

## కుర్చీల మోత

మిడ్జిల్, జూన్ 12 : పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజు విద్యార్థులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు. గత ప్రభుత్వం నిర్వహించిన మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని నేటి కాంగ్రెస్ సర్కారు అమ్మ ఆదర్శ పాఠశాలలుగా పేరు మార్చి నిధులు మంజూరు చేసింది. తరగతి గదులకు రంగులు వేయడం, మరుగుదొడ్ల మరమ్మతులు, తాగునీటి సౌకర్యం, ఫ్యాన్‌లు, లైట్లు వంటి మరమ్మతులు పూర్తి చేయాలని విద్యాశాఖ ఆదేశించినా మండలంలోని పలు పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. మండల కేంద్రంలోని హైస్కూల్‌కు ఇద్దరు, ముగ్గురు విద్యార్థులే వచ్చారు. వచ్చిన వారితోనే ఉపాధ్యాయులు కుర్చీలు మోయించి తరగతి గదులకు మామిడి తోరణాలు కట్టించారు. అయితే ఏ పాఠశాలలోనూ విద్యార్థులకు అల్పాహారం అందించలేదు.



మిడ్జిల్ పాఠశాలలో కుర్చీలు మోస్తున్న విద్యార్థి

## అస్తవ్యస్థంగా..




ముక్కిడిగుండం పాఠశాలలో మరుగుదొడ్ల దుస్థితి

కొల్లాపూర్, జూన్ 12 : విద్యాసంవత్సర ప్రారంభం విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల సంగతి పక్కకు పెడితే మొదటి రోజే ప్రభుత్వ పాఠశాలల్లో భయంభయంగా చదువులు ప్రారంభయ్యాయని చెప్పవచ్చు. మంత్రి ప్రాతినిధ్యం వహించే కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండల పరిధిలోని నార్లాపూర్ ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరింది. కానీ ఇందులోనే నూతన విద్యాసంవత్సరం క్లాసులు ప్రారంభమయ్యాయి. వరుసగా కురుస్తున్న వర్షాల దాటికి విద్యార్థులే కాదు పాఠశాలలో విద్యా బోధన చేసే ఉపాధ్యాయులు కూడా ప్రాణాలను అరచేతిలో పెట్టుకున్నారు. ముక్కిడిగుండం ప్రభుత్వ పాఠశాలలో 8వతరగతి వరకు క్లాసులు ఉన్నాయి. 160 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 70 మందికి పైగా విద్యార్థినులు ఉన్నా ఒక్క మూత్రశాల కూడా లేకపోవడంతో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి.



శిథిలావస్థకు చేరిన నార్లాపూర్ పాఠశాల

## వానొస్తే కూలుడే..



కూలేందుకు సిద్ధంగా ఉన్న వర్కూర్ పాఠశాల

మాగనూరు, జూన్ 12 : ప్రభుత్వం ఏటా పాఠశాల భవనాల మరమ్మతుకు నిధులు విడుదల చేస్తోంది. కానీ సంబంధిత అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వ ఆశయానికి గండి పడుతున్నది. మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను 2011లో నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకొన్నది. పాత గ్రంథాలయం పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరుకొని పెచ్చులూడుతున్నాయని.. భారీ వర్షాలు కురిస్తే ఏ క్షణమైనా కూలే అవకాశం ఉన్నదని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే వర్కూర్, మాగనూర్, వడ్వాట్, అమ్మపల్లి గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన మాగనూర్ ప్రాథమిక పాఠశాలలో పిల్లర్లు